క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీశ్వరస్వామి దేవాలయ శంకుస్థాపన



అచ్చంపేట: మండలంలోని చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున లక్ష్మీశ్వరస్వామి దేవాలయ శంకుస్థాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేత పండితుల మంత్రోచ్చారణాల మధ్య శంకుస్థాపన వైభవంగా జరిగింది. ముందుగా గోపూజ, కలశస్థాపన పూజలు నిర్వహించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పుల శ్రీనివాసరావు దంపతులు పూజాక్రతువు జరిపించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఉత్సవ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాలికలకు సమాన విద్యావకాశాలు కల్పించాలి



అమరావతి: మగపిల్లలతో పాటు ఆడపిల్లలు సమానంగా ఆత్మస్థైర్యంతో అవకాశాలను అందిపుచ్చుకుని ధైర్యంగా ముందుకుపోవాలని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరాప్రియదర్శిని అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో లింగవివక్షపై అవగాహన కార్యక్రమం క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా విద్యావకాశాలు కల్పించటానికి తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, పోషకాహారం, దిశ యాప్‌ల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోర బాలికలకు వివరించారు. కిశోర బాలికలు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వడ్డవల్లిలో శ్రీవారికి లక్ష తులసిపూజ

సత్తెనపల్లి: భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం 108 మంది మహిళలచే లక్షతులసి పూజ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. గత 12 సంవత్సరాల నుంచి భీష్మ ఏకాదశి నాడు తులసిపూజ జరుగుతుందని, మహిళలు ఈ తులసిపూజలో పాల్గొని వాసుదేవుని, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. ఉదయం 9.00 గంటలకు ఈ పూజ మొదలవుతుందని, భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీవారి అనుగ్రహం పొందాలన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలు తొలగించాలి

అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో, డివైడర్లపైన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని మండల సీపీఎం పార్టీ తరపున గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన అమరావతికి ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న భక్తులకు నెలల తరబడి ఉంచుతున్న ఫ్లెక్సీల వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వర్ధంతి, జయంతి, వివిధ రకాల వేడుకలకు సంబంధించిన ఫ్లెక్సీలతో పాటు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను డివైడర్లపై, విద్యుత్ స్తంభాలకు పెద్ద పెద్ద కటౌట్లు నెలల తరబడి ఉండటం, అవి గాలికి పక్కకు ఒరగటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ అధికారులు వెంటనే ఫ్లెక్సీలు తొలగించాలని కోరారు.

విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకం

సత్తెనపల్లి: ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని వేద విద్యా సంస్థల పరిపాలనా డైరెక్టర్ చింతాడ ప్రభావతి అన్నారు. పట్టణంలోని సీఏస్‌జీఎల్‌ఎం కళాశాల సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. సభకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సైదా నాయక్ అధ్యక్షత వహించారు. ప్రభావతి మాట్లాడుతూ పరీక్షలలో ఒత్తిడికి లోను కాకుండా తగిన జాగ్రత్త వహించాలన్నారు. తల్లితండ్రుల ఆశలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా 'ఈ-క్రాప్'

- పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పూర్తి నష్ట పరిహారం
- ఈ-కేవైసీ నమోదుకు ఈ నెల 22 వరకు గడువు



బృగుబండలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది

సత్తెనపల్లి: వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత అతివృష్టి, అనావృష్టి కారణాలతో పంట నష్టపోయిన రైతులకు 'ఈ-క్రాప్' నమోదు కొండంత అండగా నిలుస్తోంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా 'ఈ-క్రాప్' నమోదు చేపట్టారు. నెల రోజులుగా ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతోంది. 'ఈ-క్రాప్'లో వివరాల నమోదు కారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులు తాము పండించిన పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి సాయం పొందడానికి అవకాశం ఉంటుంది. పంట నమోదు సర్టిఫికెట్ల ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం కూడా ఉంది. పంట నష్ట పరిహారం సాధారణ రైతులతో పాటు కౌలు రైతులు కూడా పొందవచ్చు.

సత్తెనపల్లి డివిజన్‌లో 20,983 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు..

సత్తెనపల్లి డివిజన్‌లోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో రబీ సీజన్‌లో పంట సాధారణ విస్తీర్ణం 25,949.45 ఎకరాలు కాగా 21,258.18 ఎకరాల్లో పంటలు సాగు అయ్యాయి. ఇప్పటివరకు 20,983.89 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు కాగా 18,908.72 ఎకరాలు ఈ-కేవైసీ పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా పంటల వివరాల నమోదుకు ఈ నెల 19 ఆఖరు కాగా ఈ-కేవైసీ నమోదుకు ఈనెల 22 వరకు అవకాశం ఉంది. ఈ క్రమంలో నూరు శాతం వివరాలు నమోదు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది కృషి చేస్తున్నారు.

రైతులకు ప్రభుత్వం ఆసరా..

రబీ సీజన్ పంటల సాగు ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుంది. ప్రభుత్వం ఈ ఏడాది రబీ సాగుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చి ఆసరా కల్పించింది. సీజన్‌లో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకూ పూర్తి పరిహారం..

గత ప్రభుత్వాల పాలనలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రస్తుతం కౌలు రైతులకు కూడా నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. గతంలో కౌలు రైతులు లీజుకు సాగు చేసినప్పటికీ నష్ట పరిహారం భూయజమానులకే అందేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. ఈ-క్రాప్ వివరాలు నమోదు చేసేటప్పుడు ఆన్‌లైన్‌లో సాగు భూములను కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తున్నారు. దీంతో కౌలు రైతుల పేరు మీదే ఈ-క్రాప్ వివరాలు నమోదు అవుతున్నాయి. దీనివల్ల పంట నష్టపరిహారం నేరుగా కౌలు రైతులకు చేరుతుంది. ప్రస్తుత రబీ సీజన్‌లో వివరాలు నమోదుతో కౌలు రైతులకు వ్యవసాయ శాఖ జారీ చేసే ఈ-క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లతో బ్యాంకులు కొత్తగా పంట రుణాల మంజూరు చేయడంతో పాటు పాత రుణాలు రెన్యువల్ చేస్తున్నాయి.

అన్నదాతలకు ప్రయోజనాలు ఇవి..

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసిన రైతులకు నేరుగా నష్ట పరిహారం అందుతుంది. దళారీల చేతికి బీమా పరిహారం అందదు. రైతుల తరఫున ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుంది. ఈ-క్రాప్ ద్వారా రైతులు నష్టపోయిన పంట వివరాలు, సాగు వివరాలు తెలుస్తాయి. పంటల మార్పిడికి, పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల దిగుబడిపై స్పష్టత వస్తుంది.

డివిజన్‌లో పంటల సాగు, ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు ఇలా..
(విస్తీరణం ఎకరాల్లో)

మండలం	సాధారణ విస్తీరణం	సాగు విస్తీరణం	ఈ-క్రాప్ నమోదు	ఈ-కేవైసీ నమోదు
సత్తెనపల్లి	1,376.84	1,321.99	1,322.81	1,272.77
ముప్పాళ్ళ	4,737.65	4,390.97	4,004.47	3,744.87
రాజుపాలెం	4,447.06	2,223.90	2,178.03	2,009.01
నకరికల్లు	8,869.16	7,230.15	7,207.90	6,050.65
పెదకూరపాడు	756.37	1,581.44	1,560.00	1,442.54
అచ్చంపేట	1,023.49	531.27	526.62	515.17
అమరావతి	2,212.53	2,938.02	2,931.18	2,714.55
క్రోసూరు	1,196.46	504.08	521.16	473.08
బెల్లంకొండ	1,329.89	736.36	731.72	686.08

పెదకూరపాడు వైపు.. బీజేపీ చూపు

అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మూడు పార్టీలు పొత్తులలో పెదకూరపాడు అసెంబ్లీ నియోజవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ పోటీ చేయాలని నాయకులు, కార్యకర్తలు బలంగా కోరుకుంటున్నారని పెదకూరపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తమ్మ వెంగళరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రైవేటు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన నియోజగవర్గ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంటు పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజవర్గం బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు సొంత నియోజకవర్గం కావడంతో పొత్తులలో భాగంగా ఆయనను నియమించాలని అధిష్టానానికి సూచించామన్నారు. స్థానికులకు అవకాశం కల్పించి రాజధాని పరిధిలో పెదకూరపాడులో విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సెలింగ్ మెంబర్ మద్దిరాత్రి నారాయణ, జిల్లా ఓబీసీ అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు, పల్నాడు జిల్లా కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బంకా సువార్త, జిల్లా కార్యవర్గ సభ్యులు నేరెళ్ల హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు గంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెదకూరపాడు నియోజవర్గ కో కన్వీనర్ నేలపాటి జయకుమార్, మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరావు, అచ్చంపేట మండల అధ్యక్షులు పడకండ్ల లక్ష్మాచారి, అచ్చంపేట మండలం ఓబీసీ అధ్యక్షుడు మోదుల వెంకటేశ్వరరావు, జిల్లా యువ మోర్చా కార్యదర్శి నారాదాసు నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాస్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే ఏదైనా సాధించగలం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సత్తెనపల్లి: సమష్టిగా పనిచేస్తేనే ఏదైనా సాధించగలమని ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్ కాంపౌండర్స్, నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఐడీ కార్డులు ధరించాలన్నారు. ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసుకోవాలని దానికి యూనియన్ వారు సహాయ, సహకారాలు అందిస్తారన్నారు. అంజలి ఆసుపత్రి అధినేత డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర కేసులు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒంగోలు లక్ష్మణాచారి మాట్లాడుతూ యూనియన్ వారికి సభ్యులందరూ సహకరించినప్పుడు మీకు ఏ సమస్య వచ్చినా మీ కుటుంబ సభ్యులు లాగా అండగా ఉంటారన్నారు. డాక్టర్ దుర్గాప్రసాద్‌ను యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు హనుమంతరావు, ప్రెసిడెంట్ ఎస్ఎం రఫీ, మొహిద్దీన్, టీ యేసు, సెక్రటరీ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, రంజిత్ కుమార్, ఖాజావలి, తదితర కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

బేటీ బచావో, బేటీ పఢావో ర్యాలీ



క్రోసూరు: భ్రూణహత్యలు మహానేరం, చట్టరీత్యా కఠిన శిక్షలుంటాయని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణకుమారి అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ గదిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షతన, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ రవాణా, భ్రూణ హత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, నిరోధానికి తగిన సూచనలు, బాలికలకు సంబంధించిన వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలకు, అంగన్‌వాడీ వర్కర్లకు లింగ నిర్ధారణ ద్వారా జరుగుతున్న భ్రూణ హత్యల గురించి, చట్టపరమైన శిక్షలు గురించి వివరించారు. గర్భవిచ్ఛిత్తి వలన మహిళలు ఎదుర్కునే శారీరక సమస్యల గురించి, భవిష్యత్‌లో గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషణ, తగు జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో క్రోసూరు ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.మాధవి, రత్నకుమారి, మైమున్నిసా, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సారంగధరేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

దాచేపల్లి : మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపై సారంగధరేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ పూజారి తుమోజు భార్గవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీ కందుల జాను, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు ఈ భూమి పూజలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శానంపూడి అంకిరెడ్డి, అనుముల ఆంజనేయులురెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, నాయకులు అనుముల రామిరెడ్డి, జాన్ అహ్మద్, చింతల దానియేలు, ఐలాపురం నరసింహారావు, రవి పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి

మాచవరం: బాలికలు విద్యలో ఉన్నతంగా రాణించాలని హెచ్ఎం ఉమశ్రీ అన్నారు. మండలంలోని పిన్నెల్లి జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బాలికలు రక్తహీనతకు గురకాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ ఎపిఫని స్కాలర్‌షిప్‌కు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

గురజాల : ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పేరం రామహరిత దీప్తి ఎంపికైందని తెలిపారు. విజయవాడలో ఫిబ్రవరి 17వ తేదీన విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగిందన్నారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

విజయపురిసౌత్: విజయపురిసౌత్ గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని గ్రామం పురవీధుల్లో ఛత్రపతి శివాజీ సైన్యం ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ సైన్యం సభ్యులు మాట్లాడుతూ విదేశీ రాజుల దండయాత్రను అడ్డుకొని భారతదేశం సనాత ధర్మాన్ని కాపాడి అపజయం లేని ఎన్నో యుద్ధాలు చేసిన నాయకుడు శివాజీ అన్నారు. తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులతో భవాని ఖడ్గం ధరించి ఛత్రపతి శివాజీ మహరాజ్‌గా పేరుగాంచి భారతదేశ చరిత్రలో హిందూ ధర్మ దివిటీగా నిలిచాడన్నారు. ఆయన్ను స్మరించుకుంటూ ఈ శోభాయాత్ర చేయటం తమకు ఎంతో గర్వంగా ఉందని ఛత్రపతి శివాజీ సైన్యం సభ్యులు తెలిపారు.

నేడు క్రోసూరులో వలంటీర్లకు వందనం

క్రోసూరు: క్రోసూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వేంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. పెదకూరపాడు నియోజవర్గంలోని ఐదు మండలాల వలంటీర్లకు సత్కార కార్యక్రమం జరుగుతుందన్నారు. సేవ రత్న, సేవా వజ్ర, సేవా మిత్ర అవార్డులు ప్రకటించి ఘనంగా సన్మానించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

ఆర్బీకేల్లో కంది పంటను విక్రయించాలి

దాచేపల్లి : ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కంది పంటను ఆర్బీకేల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి అన్నారు. ఆర్బీకే, మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన క్వింటా రూ.9 వేల మద్దతు ధర చొప్పున కొనుగోలు చేస్తామని, ఈ ధర రోజు మార్కెట్ ధరకు అనుకూలంగా మారుతుందని ఏవో చెప్పారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు కంది పంటను విక్రయించాలని కోరారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సోమవారం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పూజారులు వేద మంత్రోచ్చారణలతో కార్యక్రమం నిర్వహించి, స్వామి వారి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పనిసరి

- సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ
- పలు పోలింగ్ కేంద్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలన



గుడిపూడిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి నివేదిక చూస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా వసతులు కల్పించాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని 11, 12, 13, 14, 15, రామకృష్ణాపురంలోని 16, గుడిపూడిలోని 17, 19, 20, 21, 22, లక్ష్మీపురంలోని 18, పెద్దమక్కెనలోని 23, 26, గర్నెపూడిలోని 27 పోలింగ్ బూతులను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సహాయ ఎన్నికల అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు, మంచినీరు, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తక్షణం తెలియజేయాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, బూతు లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, తదితరులున్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేరు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఈ పేరు వింటే హిందూ మతం పులకించిపోతుందన్నారు. మొఘలుల దాడుల నుంచి హిందూ మతాన్ని రక్షించిన ఘనత మరాఠా యోధుడు శివాజీకి దక్కుతుందన్నారు. శివాజీ గురించి చరిత్రకు తెలియని ఎన్నో నిజాలు దాగి ఉన్నాయన్నారు. తల్లి సంరక్షణలో బైరంఖాన్ శిక్షణలో రాటుదేలిన శివాజీ తన యుద్ధ తంత్రాలతో బీజపుర, గోల్కొండ సుల్తానులు, మొఘలులకు ముచ్చెమటలు పట్టించిన పోరాట యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గుంటూరు గోవిందు, గుంజి విజయ్, కుమ్మరి దస్తగిరి, మంగళాపూరి నాగేశ్వరరావు, కంటు బ్రహ్మం, చావల వెంకటేశ్వర్లు, ప్రత్తిపాటి హరేకృష్ణ, పులహరి బానోజీ, షేక్ చిన్న షరీఫ్, దుద్దిల్ల జగన్నాధం, ఏలూరి శివాచారి పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి



ముప్పాళలో పరీక్ష సామగ్రి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి, గోపాలరావు

ముప్పాళ్ళ: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశానుసారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమైన పరీక్ష సామగ్రిని సోమవారం అందించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, దమ్మాలపాడు, నార్నెపాడు, మాదల, బొల్లవరం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మాదల గ్రామంలోని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, గోళ్ళపాడులోని కేజీబీవీలోని పదవ తరగతి విద్యార్థినులకు అవసరమైన ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. మొత్తం సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావులు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులందరికీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆశీస్సులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఒంగోలు రాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళలు విరాజిల్లే ప్రాంతం సుభిక్షం



బహుమతులు అందుకుంటున్న విజేతలు

సత్తెనపల్లి: కళలు విరాజిల్లే ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం బాధల నుంచి విముక్తి, మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రముఖ్య వైద్యుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి అన్నారు. చైతన్య కళా స్రవంతి సాంస్కృతిక సంస్థ 54వ వార్షికోత్సవం పురస్కరించుకొని జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలను పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలకు సంస్థ అధ్యక్షుడు కమతం శ్రీనివాసరావు అధ్యక్షత వహించి పూర్వ వైభవాలను గుర్తు చేశారు. పిల్లుట్ల రామారావు స్థాపించిన చైతన్య కళా స్రవంతి ఏటేటా అభివృద్ధి చెందుతూ కళాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఏటా జాతీయస్థాయి పాటల పోటీలు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యదర్శి జి.అమర్నాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది కూడా పాటలపోటీలకు అధికంగా కళాకారులు హాజరయ్యారన్నారు. దాతల విరాళాలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేట నుంచి సీనియర్ గాయకుడు ఎస్.కళాంజలి, పిడుగురాళ్ల నుంచి విశ్వేశ్వరరావు, తెలంగాణ కొత్తగూడం నుంచి సరళ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సుదూర ప్రాంతాల వచ్చిన కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. మ్యూజికల్ ట్రాక్లో పాటలు పాడిన విజేతలకు బహుమతులు అందజేశారు. కేవీవీ కోటేశ్వరరావు, వాళ్ళపాటి సుశీల, మంచికంటి వెంకటేశ్వరరావు, సరోజలకు విశిష్ట సేవా పురస్కార అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కంబాల వెంకటేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, ముట్లూరి వెంకయ్య, భవిరిశెట్టి శివ సుబ్బారావు, ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య, లక్ష్మయ్య, రాంబాబు, ఫిరోజి, కల్లూరి నాగ బ్రహ్మాచారి, బెజగం రవికుమార్, మాదాసు నాగేశ్వరరావు, కంబాల శ్రీనివాసరావు, సిద్ధార్థ శ్రీనివాసరావు, అనుముల మహేశ్వరరావు, ఎంజీఎం సుభాని పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మహానేత వైఎస్సార్

జెట్టిపాలెం(రెంటచింతల): ఇచ్చిన మాట తప్పని మడమ తిప్పని మహానేతగా పేరుపొందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పార్టీ నేతలతో కలసి భూమిపూజ చేసి మాట్లాడారు. వైఎస్సార్ రాష్ట్రంలోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు అమలు చేసిన ఆరోగ్యశ్రీ, రైతన్నల శ్రేయస్సుకు జలయజ్ఞం పథకం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావులూరి నాగమ్మ, మాజీ సర్పంచ్‌లు మేకపోతుల బూరెడ్డి, శీలం అంజయ్య, పార్టీ నేతలు మేకపోతుల కృష్ణారెడ్డి, కుందురు నర్సింహారెడ్డి, డేగల సంసోన్, రమేష్ తదితరులున్నారు.